

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

నేడు రైతుల ఖాతాల్లోకి రూ.251.2 కోట్లు

ప్రజాశక్తి-అనంతపురం

ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసింది. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి ఇన్‌పుట్ సబ్సిడీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ ఓ ప్రకటనలో తెలలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లలో 2023 ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు రూ.251.2 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ మంజైరైనట్టు ఆమె పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో జిల్లాకు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి ప్రారంభించనున్నారు.



జిల్లా అభివృద్ధికి సూచిస్తున్న ప్రతిపాదనలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి అందజేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లా అభివృద్ధి అందరి అజెండా కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లా అభివద్ధి కోసం అన్ని పార్టీలు స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని సిపిఎం కోరింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రతినిధుల బందం మంగళవారం నాడు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరిలను వారి నివాసాల్లో కలిసి సిపిఎం సూచిస్తున్న ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరికీ రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాలో ఈ ప్రతిపాదనలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వారు వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఎత్తుల ద్వారా గెలవడం కాకుండా జిల్లా అభివద్ధికి స్పష్టమైన విధాన ప్రకటన చేసి దాని అమలు కోసం కషి చేయాల్సి ఉందన్నారు. ఇలా చేసి ప్రజల మనసులను గెలవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కేవలం ఒక్క శాతం సాగుభూమికి కూడా నికరమైన సాగునీటి వనరులు లేని జిల్లా అనంతపురం అన్నారు. కనీసం 1000 మందికి ప్రత్యక్ష ఉపాధి చూపించే పరిశ్రమ లేకపోవడం జిల్లా వెనుకబాటుకు నిదర్శనం అన్నారు. రైల్వే కేంద్రంగా ఉన్న గుంతకల్లు గత 20 సంవత్సరాల్లో జనాభా తగ్గిపోవడం ఆందోళనకర పరిణామం అన్నారు. రాయదుర్గంలో జీన్స్ పరిశ్రమ దాదాపు మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. తాడిపత్రిలో బండల పరిశ్రమ ఇదే స్థితిలో ఉందని తెలిపారు. రైల్వే డివిజన్ అభివద్ధి కాకపోగా పేరు మార్పుతో డివిజన్‌ను తరలిస్తారనే ఆందోళన గుంతకల్ ప్రాంత ప్రజల్లో ఉందన్నారు. కొత్త పరిశ్రమలు రాక, ఉన్న చిన్న పరిశ్రమలు మూతపడితే యువత భవితకు భరోసా ఉండదన్నారు. ఈ సమస్యలపై ఆయ పార్టీల అధినాయకత్వంతో జిల్లా అభివద్ధి అవసరమైన వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమల ఏర్పాటు, విద్య, వైద్యం, సామాజిక తరగతుల అభివద్ధి, మహిళ సంక్షేమంపై విధాన ప్రకటనలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎస్.నాగేంద్ర కుమార్, ఎం.బాలరంగయ్య, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ముస్కిన్, వెంకట నారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.



జిల్లా అభివృద్ధికి సూచిస్తున్న ప్రతిపాదనలను మాజీ మంత్రి పరిటాల సునీత అందజేస్తున్న సిపిఎం నాయకులు

టిడిపిలో ఆగని లుకలుకలు



ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపిలో లుకలుకలు తగ్గడం లేదు. అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచి మూడు నియోజకవర్గాల్లో అసమ్మతి నేతల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది. ఇవి రోజురోజుకు అధికం అవుతూనే ఉన్నాయి. అసమ్మతి నేతలతో అధిష్టానం ఎంత మట్లాడినా ఫలితం దక్కడం లేదు. శింగనమల, కళ్యాణదుర్గం, మడకశిర నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థిని మార్చాలంటూ బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు.

- మడకశిరలో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట తమ్ముళ్ల నిరసన
- బండారు శ్రావణికి మద్దతునివ్వనన్న కేశవరెడ్డి
- కళ్యాణదుర్గంలోనూ అసమ్మతి రాగం
- గుంబనంగా పెనుకొండ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పది రోజుల క్రితం టిడిపి అధిష్టానం ఉమ్మడి జిల్లాలో 9 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో మడకశిర, కళ్యాణదుర్గం, శింగనమల, పెనుకొండ నియోజకవర్గాల్లో అభ్యర్థులపై అసమ్మతి నేతలు ఆక్రోశం వెల్లగక్కారు. అభ్యర్థులను మార్చాల్సిందే అంటూ వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. పార్టీ ముఖ్య నేతలను కలిసి తమ నిరసన గళాన్ని విన్పిస్తున్నారు. మడకశిర, శింగనమలలో గత రెండు ఈ అసమ్మతి సెగ మరింత ఎక్కువ అయినట్లు కన్పిస్తోంది.

మడకశిర అభ్యర్థిని మార్చాల్సిందే..!

మడకశిరలో అభ్యర్థి సునీల్ కుమార్‌ను మార్చాలంటూ పెద్దఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం నాడు నిరసనకు దిగారు. మార్చకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని అల్టిమేటం కూడా ఇచ్చారు. ఏకంగా ఓ కార్యకర్త ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిరసన తెలిపాడు. మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్ కుమార్‌కు అధిష్టానం టిక్కెట్టును ఖరారు చేసింది. ఈయనకు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిల మధ్య ముందు నుంచి పొసగడం లేదు. దీంతో తిప్పేస్వామి మద్దతుదారులు సునీల్‌కుమార్‌ను మార్చాలని పట్టుబడుతున్నారు. మార్చకుంటే ఆత్మహత్యలే శరణ్యమని మడకశిర పట్టణంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు.

శింగనమలలో కుదరని సఖ్యత

శింగనమల అభ్యర్థిగా బండారు శ్రావణికి అధిష్టానం పార్టీ టిక్కెట్టు ఖరారు చేసింది. ఈమెకు ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడులు మధ్య పొసగడం లేదు. గతంలో ఆమెను నియోజకవర్గ ఇన్‌ఛార్జి నుంచి తొలగించి టూమెన్ కమిటీ పేరుతో వారికి బాధ్యతలు అప్పగించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం బండారు శ్రావణికే అధిష్టానం టిక్కెట్టును ఖరారు చేసింది. ఈ నిర్ణయం తరువాత ఆమె ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డిని తన అనుయాయులను వెంట బెట్టుకుని కలిసేందుకు వెళ్లారు. ఈ సమయంలో జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషియల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆడపిల్లను ..మీ అంతటి రాజకీయ అనుభవం లేదు... తనకు మద్దతునివ్వాలంటూ.' బండారు శ్రావణి టిడిపి నాయకులు కేశవరెడ్డిని కోరారు. అయితే కేశవరెడ్డి మాత్రం తాను మద్దతునివ్వనని తేల్చి చెప్పడం గమనార్హం. 'నా సొంత తమ్ముడిపై కేసు పెట్టావు... నేను నీకు ఏ రకంగా మద్దతునివ్వాలి... నేను ఇవ్వలేను.' అని కేశవరెడ్డి చెప్పడం ఆ వీడియోలో ఉంది. యువగళం సమయంలో అక్కడ జరిగిన ఘటనను మాత్రమే పోలీసులకు రాతపూర్వకంగా ఇచ్చానని శ్రావణి సర్దిజెప్పే ప్రయత్నం చేసినా కేశవరెడ్డి వినలేదు. కాంగ్రెస్ హయాంలో శైలజనాథ్ మంత్రిగా ఉన్నప్పుడు హత్య కేసు పెట్టినా భయపడలేదు.. నీ కేసుకు ఏంది భయపడేది... అని కేశవరెడ్డి చెప్పడం అందులో కనిపించింది.

కళ్యాణదుర్గంలోనూ అసమ్మతి రాగం..

కళ్యాణదుర్గం టిడిపిలోనూ అసమ్మతి రాగం కన్పిస్తోంది. కళ్యాణదుర్గం టిడిపి టికెట్టు తమకు కావాలంటే తమకు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడులు పట్టుబడుతూ వచ్చారు. అయితే అధిష్టానం కొత్త అభ్యర్థిగా అమిలినేని సురేంద్రబాబుకు టికెట్టును ఖరారు చేసింది. టికెట్టు ఖరారు అయినప్పటి నుంచి సురేంద్రబాబు తాను అందరినీ కలుపుకుని వెళ్తానని పదేపదే చెబుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నాడు అమిలినేని సురేంద్రబాబు మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి ఇంటికెళ్లి కలసిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని కోరినట్టు పొటోలొచ్చాయి. అయితే ఇద్దరి మధ్య ఏ విధమైన సంభాషణ జరిగిందన్న విషయం తెలియలేదు.





మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరితో మాట్లాడుతున్న అమిలినేని సురేంద్రబాబు



మడకశిర టిడిపి అభ్యర్థిని మార్చాలని కోరుతూ మడకశిరలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలుపుతున్న టిడిపి కార్యకర్త

గుంబనంగా పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం టిడిపిలోనూ పరిస్థితి గుంబనంగానే కన్పిస్తోంది. ఇక్కడ నుంచి టికెట్టు తనకే అని ధీమాగా ఉన్న టిడిపి శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారధి స్థానంలో అధిష్టానం సవితమ్మకు టికెట్టు ఖరారు చేసింది. అప్పటి నుంచి బికె మద్దతుదారులు అధిష్టానంపై గుర్రుగానే ఉన్నారు. ఇటీవల రా..కదిలిరా.. కార్యక్రమం నిర్వహణ సందర్భంగా బికె ఇంటికి వెళ్లిన జిల్లా, పెనుకొండ నియోజకవర్గ పరిశీలకులను బికె మద్దతుదారులు అడ్డుకుని నినాదాలు చేశారు. అయితే బికె.పార్థసారధి మాత్రం అధిష్టానంపై ఎక్కడా అసంతృప్తిని వ్యక్తం చేయలేదు. టికెట్టు విషయంలో మాత్రం ఇప్పటివరకు సవితమ్మ, పార్థసారధి గ్రూపులు ఎడమోహంగానే ఉంటున్నాయి. ఇలా నాలుగు నియోజకవర్గాల్లోనూ టిడిపి అభ్యర్థులకు వ్యతిరేకంగా లుకలుకలు బాహాటంగానే కన్పిస్తున్నాయి. ఎన్నికల సమయం ఆసన్నమవుతున్నా అసంతృప్తులు కొనసాగు తుండడం ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళాన్ని నింపుతోంది.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- శక్తిని గుర్తించి ఉన్నత ఆశయాలు సాధిద్దాం
- మహిళా దినోత్సవంలో డాక్టర్ ఉషారాణి
- 'ధీర' పుస్తకాన్ని ఆవిష్కరించిన కెఎస్ఎన్.డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య



'ధీర' పుస్తకాన్ని విద్యార్థులతో కలిసి ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య, డాక్టర్ ఉషారాణి, సావిత్రి తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళలు పురుషులతో పాటు సమాన హక్కులు సాధించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని డాక్టర్ ఉషారాణి పిలుపునిచ్చారు. మార్చి 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం నగరంలోని కెఎస్ఎన్ డిగ్రీ మహిళా కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఉషారాణి హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళ పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఓర్పు, సహనం, ప్రేమ, ఆప్యాయత, కరుణ, వంటివి మహిళల సొంతం అన్నారు. మహిళలు ధైర్యంతో ముందుకు సాగితే అగ్రస్థానం వారిదే ఉంటుందన్నారు. వ్యవస్థలో మహిళ ఒక భాగం కావాలన్నారు. అభద్రతా భావాలను తొలగించుకోవాలన్నారు. జీవిత ఆశయాన్ని తెలుసుకుని మనుగడ సాధించాలన్నారు. విశిష్ట అతిథి కెఎస్ఎన్ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. మహిళ శక్తి గొప్పదన్నారు. హక్కుల కోసం పోరాడుతూనే బాధ్యతలను నెరవేర్చాలన్నారు. అప్పుడే అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. సమానత్వం కోసం ఇలాంటి సెమినార్‌లు నిర్వహించుకునే పరిస్థితుల నుంచి సమాజమే గౌరవించే రోజులను సాధించుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ఎందరో మహిళా త్యాగధనుల ప్రాణార్పణలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. సమానత్వం, వివక్ష రూపుమాపడం, 8 గంటల పని దినాలు, ఓటు హక్కు, ప్రసూతి సెలవులు వంటి వాటి సాధనకు నాడు వీర మహిళలు ప్రాణాలు అర్పించి సమాన హక్కులు సాధించారని కొనియాడారు. వారి వారసత్వాన్ని కొనసాగించి భవిష్యత్ తరాలకు మహిళా ప్రాధాన్యతను చాటి చెప్పాలన్నారు. హక్కుల కోసం పోరాడే దినంగా, త్యాగధనలను స్మరించుకుంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. వారి త్యాగాలను భవిష్యత్ తరాలకు చాటి చెప్పేలా మహిళలు అభివృద్ధి సాధించి గౌరవింప బడాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రూపొందించిన 'ధీర' పుస్తకాన్ని ప్రిన్సిపల్ శంకరయ్య చేతుల మీదుగా విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, అరుణమ్మ, ప్రజానాట్య మండలి క్రిష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కన్వీనర్ పాతిమా బేగం, పర్వీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఎస్ఎఫ్ఐ ఉమెన్ కన్వీనింగ్ కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు సిద్దూ, గిరి, నగర నాయకులు సోము, గణేష్, బాలరాజు, రాధా పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను మినహాయించాలి

కలెక్టరేట్ ఎఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కలెక్టరేట్ ఏఓకు విన్నవిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దీర్ఘకాలిక (క్యాన్సర్, గుండె, నరాల, కిడ్నీ మొదలైన రోగాలు) వ్యాధులతో బాధపడు తున్న వారిని, ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని, చంటి బిడ్డ తల్లులను, గర్భవతులైన మహిళ ఉద్యోగ ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య కోరారు. ఈమేరకు మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ జి.అంజన్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వైద్యుల సూచనల మేరకు ఎన్నికల విధుల నుంచి మినహాయించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయించాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రతి ఓటరు రెండు ఓట్లు వినియోగించుకోనుండంతో ఆలస్యం అవుతుందన్నారు. కావున ఓటర్ల సంఖ్య 800కు మించి ఉండకుండా చూడాలన్నారు. ఒక వేళ ఓటర్ల సంఖ్య 800 కంటే ఎక్కువ సంఖ్యలో ఉంటే రెండవ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి తగినంత మంది పోలీసులతో రక్షణ కల్పించాలన్నారు. ప్రతి పోలింగ్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడే విధంగా తగినంత మంది పోలీసులను నియమించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ.వీ.ఎంలను పోలింగ్ సిబ్బందికి అందజేయడానికి ముందుగా ఒకటికి రెండుసార్లు సరి చూసుకొని బాగా పని చేసే వాటిని పోలింగ్ కేంద్రాలకు కేటాయించాలన్నారు. ఒక వేళ ఈవీఎంలు మురాయించిన ఎడల పోలింగ్‌కు ఆటంకం కలగకుండా వాటిని వెంటనే సరి చేయడానికి టెక్నికల్ సిబ్బందిని కూడా నియమించాలన్నారు. పోలింగ్ స్టేషన్‌కు తగినంత మంది పోలింగ్ సిబ్బందిని నియమించి వారి కాలకత్యాలు తీర్చుకోనడానికి వాష్ రూమ్స్ ఉన్న భవనాలను పోలింగ్ కేంద్రాలుగా కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, మండలాల నాయకులు శేషప్ప, గంగాధర్, సంపత్ కుమార్, చంద్రమోహన్, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.





నేడు భువనేశ్వరి..7న లోకేష్ రాక

ప్రజాశక్తి-అనంతపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి ముఖ్య నాయకుల పర్యటనలు పెరిగాయి. ఒకరి తరువాత ఒకరు ముఖ్య నేతలు పర్యటిస్తున్నారు. ఈ నెల 4వ తేదీన పెనుకొండలో జరిగిన రా..కదిలిరా సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. తాజాగా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో చేపట్టిన యాత్రలో భాగంగా బుధవారం నాడు కళ్యాణదుర్గం, కణేకల్లు మండలాల్లో పర్యటించనున్నారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని కొండాపురం, ముద్దినాయనపల్లి, కణేకల్లు మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ గ్రామాల్లో చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా మరణించిన టిడిపి కార్యకర్తల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్థిక సాయం అందించనున్నారు. ఇక ఈ నెల 7వ తేదీన శంఖారావం కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో టిడిపి శ్రేణులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐటి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 32 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జిఎస్ఎస్.వైభవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేబ్రియల్, హిటాచి కంపెనీ' ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఈసిఈ, ఈఈఈ మెకానికల్ విభాగానికి సంబంధించిన పివికెకె ఐటి పాలిటెక్నిక్ విద్యార్థులు సంవత్సరానికి రూ.2.16 లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు బి.జయచంద్ర, ఇ.ఎన్.రోజా, జి.వెంకటేషలు, కె.జయలక్ష్మి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నార్పల స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నాపత్రాలు

నార్పల : పదో వతరగతి సెట్-1 పేపర్లు మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు ప్రశ్నపత్రాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నగేష్, రవికుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

స్టీల్ ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు నాదల్

ప్రజాశక్తి-రాయదుర్గం



మాట్లాడుతున్న స్టీల్ ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు బిఎం నాదల్

రాజకీయ పార్టీల నాయకులు రాయదుర్గం నియోజకవర్గంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇవ్వాలని స్టీల్‌ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు బిఎం.నాదల్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాయదుర్గం నియోజకవర్గంలో కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఒప్పందాలు జరిగినా అమలుకు నోచుకోలేదన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులు నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొత్రేష్, మహిళా సమాఖ్య నాయకురాలు పార్వతి, పిడిఎస్‌యు, ఆల్ మెగా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో ఇంటింటి చెత్త సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



చెత్త వాహనాలను పరిశీలిస్తున్న మేయర్ వసీం, తదితరులు

చాలారోజుల తర్వాత నగరంలో ఇంటింటి చెత్త సేకరణను పున:ప్రారంభించినట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్, క్లాప్ ఆటోలు ద్వారా సక్రమంగా ఇంటింటా చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురానికి 47 క్లాప్ ఆటోలు వచ్చాయన్నారు. ఈనేపథ్యంలో కొద్దిరోజుల నుంచి చెత్త సేకరణ ఆగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నుంచి సేకరణ జరగలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో మళ్లీ క్లాప్ ఆటోల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ముఖ్యంగా తడి, పొడి, హానికర చెత్తను ప్రత్యేకంగా విభజించి చెత్త బుట్టల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ సంఘం శ్రీనివాసులు, డిఇ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

రాయదుర్గం : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ వార్డు వాలంటీర్లు, మెప్మా రీసోర్స్‌పర్సన్లు పాల్గొంటే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. ఆర్‌పిలు, వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్సీల ద్రోహి సీఎం జగన్ : టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ ఎస్సీల పథకాలను అటకెక్కించి ద్రోహిగా మారారని అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిసి వరుణ్ అన్నారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ, ప్రజా సమైక్య ఆధ్వర్యంలో సీఎం జగన్ ప్రభుత్వం చేసిన ఎస్సీలకు చేసిన ద్రోహాన్ని ఎలుగెత్తి చాటేందుకు చేపట్టిన బస్సుయాత్రను టిసి వరుణ్ ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీల అభ్యున్నతి కోసం గత ప్రభుత్వాలు అమలు చేస్తున్న 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. ఎస్సీల అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్న జనసేన పార్టీకి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబూరావు, సాకే మురళి, కిరణ్‌కుమార్, నగర కార్యదర్శులు కుమ్మర మురళి, సంపత్, ఆకుల అశోక్, నాయకులు దంపెట్ల శివ, విజయ రాయల్, వినయ్, నౌషాద్, ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య వ్యవస్థాపకులు మద్దిలచెరువు మల్లి, జిల్లా అధ్యక్షులు మన్నల పెద్దిరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లూరు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ముత్యాలు రాచేపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనాథ్, ఎస్సీ, ఎస్టీ నాయకులు సాకే హరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గడ్డం ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎవరొచ్చినా విజయం మనదే

వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఎవరొచ్చినా వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయమని వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించారు. ఎర్రితాత దేవస్థానం నుంచి ప్రారంభమైన విజయ సంకల్పయాత్ర దివంగత సిఎం రాజశేఖర్‌రెడ్డికి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి తగ్గుపర్తి, రామసాగరం, అంకంపల్లి, దుద్దేకుంట, కోనంపల్లి, తదితర గ్రామాల మీదుగా కాలువపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రజల వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తుండటంతో ప్రజల్లోకి వస్తున్నారన్నారు. వారి మాటలను నమ్మవద్దన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి ఉరవకొండలో వైసిపి జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, వైసిపి అధ్యక్షులు చిన్న మచ్చన్న, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శివలింగప్ప, శ్రీనివాసులు, రమేష్, పెద్దన్న, ఎర్రిస్వామి, మల్లారెడ్డి, రామిరెడ్డి, శ్రీరంగాపురం సర్పంచి సాహితిరెడ్డి భర్త మారుతి, గంగవల్లి ఎంపిటిసి రేకమ్మ భర్త వెంకటరెడ్డి, సర్పంచి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి ప్రణయ్‌రెడ్డి

సిపిఎం కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో సిపిఎం కార్యాలయానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం కార్యాలయ నిర్మాణానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, రైతుసంఘం మండల కార్యదర్శి రాము, మధ్యాహ్న భోజన పథకం జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, ఐద్వా మండల కమిటీ సభ్యులు రాజేశ్వరమ్మ, లక్ష్మన్న, కరెప్ప, రాము, పరమేష్, వెంకటమ్మ సిపిఎం కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నార్పల : మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు గ్రామంలో అర్హులకు స్థలాలు ఇవ్వకుండా రెండు, మూడు ఇళ్లు ఉన్నవారికే స్థలాలు కేటాయించారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు జగనన్న కాలనీలో ఆక్రమణలను గుర్తించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పుల్లప్ప, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రాయదుర్గం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అల్లాబకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల సంబంధించిన అధికారులు హాజరుకావాలని కోరారు.

1, 2వ వార్డుల్లో 'వాక్ విత్ మెట్టు'

రాయదుర్గం : పట్టణంలోని 1, 2వ ఎన్నికల వార్డుల్లో మంగళవారం 'వాక్ విత్ మెట్టు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గోసే బావి వినాయక ఆలయం వద్ద మొదలైన ఎన్నికల ప్రచార కార్యక్రమం ఓబులాచారి రోడ్డు, నేసేపేట మొదలైన చోట్ల కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, వార్డు సభ్యులు గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, శ్రీలక్ష్మి, జంపి అజయ్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, పార్టీ నాయకులు శివ, దివాకర్, నిజాముద్దీన్, రాజు, అంపారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శివభక్తులకు అన్నదానం



శ్రీశైలం సమీపంలో అన్నదానం చేస్తున్న కాంతారెడ్డి మిత్రబృందం

రాయదుర్గం రూరల్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు అటవీమార్గంలో కాలినడకన వెళ్తున్న వారికి రాయదుర్గం పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ ఆర్.టి.కాంతారెడ్డి మిత్ర బృందం అన్నదానం చేస్తోంది. దాదాపు 13 ఏళ్ల నుంచి శివభక్తులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా కాంతారెడ్డి మిత్రబృందం మంగళవారం నుండి హటకేశ్వరం సమీపంలో అన్నదానానికి శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా మూడు రోజులకు సరిపడేలా కిరాణా సామగ్రితో లారీలో సిబ్బంది సోమవారం రాత్రి హటకేశ్వరానికి చేరుకున్నారు. వేళకు తగ్గట్టుగా వంటావార్పు చేస్తూ భక్తులకు నిరంతరం అన్నదానం చేస్తుంటారు. వేలాదిమందికి ఆకలి, దప్పిక తీరుస్తున్నామనే తృప్తితో రెట్టించిన ఉత్సాహంతో మిత్రబృందం మూడు రోజులపాటు శ్రమిస్తుంది. పలు ప్రాంతాల నుండి వచ్చే భక్తులు అన్నదానం చేస్తున్నందుకు రాయదుర్గం వాసుల ఔదార్యాన్ని కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం జడ్పిటిసి హొన్నే మల్లికార్జున, మధుసూదన్‌రెడ్డి, యోగానంద, కృష్ణమూర్తి, హనుమేష్, రఘు, గోవిందు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి : ఎంపిడిఒ

నార్పల : వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ రాముడు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మార్చిలోనే ఎండలు విపరీతంగా పెరిగిపోయాయని, ఏప్రిల్, మే నెలలో ఇంకా పూర్తిస్థాయిలో పెరిగే అవకాశం ఉందన్నారు. ముందస్తుగానే గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా నీటి ఎద్దడి రానీకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎవరెవరి పంచాయతీల్లో ఎన్ని బోర్లు ఉన్నాయి.. ఎన్ని చేతిపంపులు ఉన్నాయి.. వాటిలో ఎన్ని పని చేస్తున్నాయి.. ఎన్ని పని చేయడం లేదనే వివరాలను తెలుసుకుని ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలన్నారు. పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన పాలవెల్లువ డైరీలను పర్యవేక్షిస్తూ పాడి రైతులు పాలను ప్రభుత్వ డైరీలకు వేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు జీవితమంతా కుట్రలు, కుతంత్రాలే..

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి అధినేత చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలతోనే సాగిందని ఎమ్మెలఏయ అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని 2వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోరకంగా మాట్లాడడం చంద్రబాబు నైజం అన్నారు. సిఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రం శ్రీలంకగా మారుతోందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే అవే హామీలు అమలు చేస్తామని మాయమాటలు చెబుతున్నారన్నారు. 2014 ఎన్నికల్లో 600కుపైగా హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. ముఖ్యంగా రైతు, డాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేశానని, 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు జీవితం అంతా కుట్రలు, కుతంత్రాలే అన్నారు. పెనుకొండలో జరిగిన 'రా కదలి రా' సభలో రాయలసీమ గురించి చంద్రబాబు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే పెనుకొండ ప్రాంతంలో రక్తం పారిందని గుర్తు చేశారు. టీడీపీకి, జనసేనకు ఇవే చివరి ఎన్నికలు అన్నారు. ప్రతిపక్షాలను కలుపుకుని వచ్చినా అధికారంలోకి వచ్చేది జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత

రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాల పంపిణీతో ఆర్థిక భరోసా

ఇళ్ల పట్టాల పంపిణీలో నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ 31.19 లక్షల రిజిస్ట్రేషన్ ఇళ్లపట్టాల పంపిణీతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని వైసిపి సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సచివాలయం-1లో జగనన్న కాలనీల లబ్ధిదారులు 250 మందికి ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఇంటిస్థలాలు, అసైన్‌మెంట్ భూములకు శాశ్వత భూహక్కు కల్పించడం గొప్ప విషయమన్నారు. ఇళ్లస్థలాలతోపాటు లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ కూడా చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షులు వీరన్న, సర్పంచి లలిత, ఎంపిపి నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరం బాషా, మాజీ ఎంపిపి చంద్రమ్మ, మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మలానాయక్, నాయకులు మీనుగ బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న, వార్డు సభ్యులు వాసు, శర్మస్, బాను బేగం, ఎంపిటిసి హొన్నూరు సాబ్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి కళ్యాణ మండపంలో అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మండల పరిధిలోని అర్హులందరికీ రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి హేమలత, మండల కన్వీనర్ నరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైఎస్ ఎంపిపి నీలిమ, విజయ్, మల్లన్న, తహశీల్దార్ పరమేశ్వరస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

కళ్యాణదుర్గం : సీఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. మంగళవారం స్థానిక 9వ సచివాలయంలో పలువురికి ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, కమిషనర్ నర్సారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించాం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-నార్పల

వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేద్దామని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించిన వారు పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమం చేరిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ చిత్తూరు రఘునాథరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మొరుసు రమణారెడ్డి, సంజీవరెడ్డి, డొక్కా కిష్ట, మార్కెట్ మాజీ డైరెక్టర్ దిద్దికుంట కేశవరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : రాష్ట్రంలో వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పతకాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, నాయకులు గొల్ల రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, నల్లప్ప, వరుకూటి ఓబుళపతి, బాలకృష్ణ, నవీన్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటప్ప, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాచేపల్లి, నాయనవారిపల్లి గ్రామాల్లో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎందుకంటే ఇక్కడ ఎవరు ఎమ్మెల్యేగా గెలిస్తే ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. ఈ సెంటిమెంట్ ప్రకారం ఇక్కడ బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుని చంద్రబాబును సిఎంను చేసుకుందామన్నారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపితే ఎస్సీ, ఎస్టీలతోపాటు బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిప మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మండల మాజీ కన్వీనర్ చితంబరిదొర, మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, సీనియర్ నాయకులు చిదానందనాయుడు, పెరవలి రాము, జగ, అట్టే రామాంజనేయులు, బోయ సత్తి, నారాయణ, అనిల్‌కుమార్, మాజీ ఎంపిటిసి ఓబుళేసు, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

ఒపిఎస్ అమలు చేసే వారికే మద్దతు : యుటిఎఫ్

ఉరవకొండ : ఒపిఎస్ అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన వారికి తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి స్పష్టం చేశారు. ఈమేరకు వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేసేందుకు స్పష్టమైన హామీ ఇచ్చేందుకు కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ యుటిఎఫ్ ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయరాములు, శ్రీనివాసులు, రఘు, లక్ష్మీనారాయణ, ఉమాపతి, నాగరాజు, మైలార్ లింగ, రాము, వేణు, శ్రీధర్, రామచంద్ర, నరసింహులు, రవి, తిప్పన్న, రామచంద్ర, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓట్ ఫర్ ఒపిఎస్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఒపిఎస్ సాధన కోసం, జిపిఎస్, సిపిఎస్‌లకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఒపిఎస్‌పై స్పష్టమైన హామీ ఇచ్చి రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'చలో ఉంతకల్లు'

రాయదుర్గం : బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించనున్న 'చలో ఉంతకల్లు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళవారం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వారు మాట్లాడుతూ ఉంతకల్లులో పాఠశాల స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ పాఠశాల విద్యార్థులను కలుపుకుని విద్యార్థి యువజన సంఘాలు 'చలో ఉంతకల్లు'కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రేష్, తాలూకా అధ్యక్షులు కుమార్, ఎన్.ఎస్‌యుఐ జిల్లా నాయకులు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి



బస్సుయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

శింగనమల : ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధన కోసం ప్రజాసంఘా ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను జయప్రదం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే మురళీకృష్ణ, నాయకులు గంపెట్ల శివ, చొప్ప చంద్ర, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గడ్డం ముత్యాలప్ప పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బుక్కరాయసముద్రానికి చేరిన బస్సుయాత్రకు జనసేన, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మద్దతు తెలిపారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను బలవంతంగా లాకుంటున్నారన్నారు. అంతేగాకుండా సంక్షేమ పథకాలను ఎత్తివేశారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో ప్రభుత్వ ఓటమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మన్నల పెద్దిరాజు, రాష్ట్ర కార్యదర్శి పాలచర్ల ముత్యాలు, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనాథ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లూరు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాచేపల్లి శ్రీనివాసులు, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు శరత్‌బాబు, పార్లమెంటు అధ్యక్షులు చిరంజీవి, జైభీమ్ అధ్యక్షులు ఆకులేడు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

మన్నీలకు రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మన్నీల నాయకులు

అనంతపురం : రూరల్ మండల పరిధిలోని మన్నీల పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సర్పంచి అల్లు త్రిలోకనాయుడు, ఉపసర్పంచి రామాంజమ్మ, సిపిఎం మండల కార్యదర్శి రామాంజి కోరారు. మంగళవారం డిపిఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో జనరల్ ఫండ్ రూ.2.50లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలు ఉన్నా పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వల్ల నిధులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోతోందన్నారు. ప్రస్తుతం పంచాయతీలో తాగునీటి సమస్య ఉందన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించి నిధులను సక్రమంగా వినియోగించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం : ఎస్‌ఎఫ్‌ఐ

గుత్తి : వైసిపి అధికారంలోకి వచ్చాక సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ విమర్శించారు. మంగళవారం గుత్తిలో నిర్వహించిన సమావేశ ంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి డైట్ బిల్లులు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వార్డెన్లు అప్పులు చేసి మరీ విద్యార్థులకు భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ప్రగల్భాలు పలికే ప్రభుత్వం డైట్ బిల్లులు ఎందుకు పెండింగ్ పెట్టిందని ప్రశ్నించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గహాలకు నాడు-నేడు పథకం అమలు 'నీటి బుడగ'లా మారిందన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యల పరిష్కారానికి తాము పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఖాజా, కృష్ణ, ధను, రామ్మోహన్, మధు, పెద్దబాబు, బాలు, జిలాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు

ఉరవకొండ : పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మానసిక వైద్య నిపుణులు విశ్వనాథ్, వైద్యాధికారిణి పావని సూచించారు. 'పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని అధిగమించడం ఎలా' అనే అంశంపై మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల సమయంలో రాత్రిపూట ఎక్కువ సమయం చదవరాదన్నారు. త్వరగా చదువు ముగించి ప్రశాంతంగా నిద్రపోవాలన్నారు. ముఖ్యంగా టివిలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రశాంతమైన నిద్ర-ఆరోగ్యం పై ప్రభావం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి షఫీ,పాఠశాల హెడ్మాస్టర్ షకీలా బాను,తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు ప్రవాస భారతీయులు రవీంద్రనాథ్ కల్లమాడి, సతీమణి రమాదేవి, కుమారుడు సుజయ్ కల్లమాడి పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, సుబ్బారావు, కిష్టప్ప, ఓబులపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల ఫలితాలు విడుదల

అనంతపురం : తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారక రాయలసీమ చిత్రలేఖనం పోటీల ఫలితాలను సమన్వయకర్త అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సలహామండలి సభ్యులు, సీమ ఉద్యమ నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, డేవిడ్, శరత్‌కుమార్‌రెడ్డి, శేషాద్రి మంగళవారం విడుదల చేశారు. రాయలసీమ ఇతివృత్తం నేపథ్యంగా రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం అనంతపురం కేంద్రంగా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 118 మంది చిత్రకారులు చిత్రించిన 125 చిత్రాలు పోటీలకు వచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించి విజేతల ఫలితాలను విడుదల చేశారు. న్యాయ నిర్ణేతలుగా ఎల్.ఆర్ వెంకటరమణ, ఆర్ట్స్ కళాశాల సహాయ ఆచార్యులు, చిత్ర కళానిపుణులు అంకే శ్రీనివాస్ వ్యవహరించారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

పుట్లూరు : వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి టిడిపి విజయానికి పని చేద్దామని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధి లోని కోమటికుంట్ల గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ బాలరంగా ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ మనల్ని కలిసి స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతనే గెలుపుకోసం పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుదర్శన్‌నాయుడు, చెర్లోపల్లి రవీంద్రనాథ్‌నాయుడు, శ్రీనివాసరెడ్డి, డిసి ఓబుళనాయుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల మహాగర్జనను విజయవంతం చేద్దాం

పామిడి : వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న వికలాంగుల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంఆర్‌పిఎస్ రాయలసీమ అధ్యక్షురాలు సునీత పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎద్దులపల్లి సర్కిల్‌లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు వెంకటేశు, జయరాముడు, మండలాధ్యక్షుడు నల్లప్ప, కొట్టాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కేశవాచారి, సర్వేష్, వంకరాజుకాలవ నాగభూషణ, శివన్న, నీలూరు సుధాకర్‌రెడ్డి, కొండాపురం ఓబుళపతి, పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన 25 వైసిపి కుటుంబాలు మంగళవారం అనంతపురంలోని పరిటాల సునీతమ్మ క్యాంపు కార్యాలయంలో టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా పరిటాల సునీత వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టిడిపిలోకి చేరిన వారిలో మాజీ ఎంపిటిసి జి.తిప్పక్క, మాజీ ఉప సర్పంచి జి.తిక్కస్వామి, ఎస్.అనిల్, పి.నారాయణ, కుర్లపల్లి ఎస్.చిన్న ఆవన్న, ఇ.ఎర్రిస్వామి, ఎస్.రామాంజనేయులు, జి.నాగేంద్ర, జి.నారాయణస్వామి, జి.రామన్న, జి.లక్ష్మన్న, జి.మహేష్, జి.అంగడి మల్లి, ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.రుద్రప్ప, ఏ.ఈశ్వరయ్య, ఏ.చిన్న ఈశ్వరయ్య, ఏ.సోమన్న, ఏ.చిన్న సోమన్న, జే.కపిరాజు, ఎస్.ధనుంజయ, ఎస్ తిప్పయ్య, గాలి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారం : ఎమ్మెల్యే తోపుదుర్తి

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల నుంచి బుధవారం ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తుంచనున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అభ్యర్థులు ప్రకటించిన అభ్యర్థులకు పార్టీ శ్రేణులు సహకరించడం లేదన్నారు. పెనుకొండలో నిర్వహించిన 'రా కదిలిరా' సభ ఇందుకు నిదర్శమన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయాన్ని ఆపలేరన్నారు.

8న మ్యూజియం ప్రారంభం

అనంతపురం : జిల్లాకేంద్రంలోని ఆదిమూర్తి నగర్‌లో ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా ఉన్న పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు ప్రభుత్వ ప్రదర్శనశాలను ఈనెల 8న మంత్రి రోజా ప్రారంభించనున్నట్లు పురావస్తు శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి.రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మ్యూజియం గ్రాంట్ స్కీమ్' కింద రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ సహకారంతో రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా మూడంతస్థులతో మ్యూజియంను నిర్మించినట్లు తెలిపారు.

11న జిల్లాకేంద్రంలో వంటావార్పు

ఉరవకొండ : ఉరవకొండలోని గాంధీ అంజన హాస్టల్‌లో భూ సమస్య పరిష్కారం కోసం ఈనెల 11న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించిన నిరసన తెలపనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఉరవకొండలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.